క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



సూచనలిస్తున్న శ్రీనివాసరావు

సరుబుజ్జిలి: అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు అన్నారు. షళంత్రిలో బుధవారం జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశానికి హాజరయ్యారు. టేక్ హోమ్ రేషన్‌ను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. పరిశీలనలో షళంత్రి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు గ్రేస్ శాంతి

హిరమండలం: ఫిజియోథెరపీ సేవలను ప్రత్యేకావసరాల గల చిన్నారులు సద్విని యోగం చేసుకోవాలని భవిత కేంద్రం వైద్యాధికారి మేడం గ్రేస్ శాంతి అన్నారు. స్థానిక ఐఆర్‌సీ కేంద్రంలో ప్రత్యేకావసరాల గల చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. మండలంలోని నలుమూలల నుంచి వచ్చిన 14 మంది చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం



భూషణరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: సమాజాన్ని దిశానిర్దేశం చేయడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన రాబిల్లి భూషణరావును ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత భూషణరావు మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో నిజాయితీ, నిబద్ధత ఎంతో అవసరమన్నారు. విధి నిర్వహణలో సహకరించిన అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు రవికుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు పరిసరాలు పరిశుభ్రతే ప్రధానమని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, మాకివలస పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. అంటు వ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం లభిస్తుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లపై విచారణ

పొందూరు: పొందూరు, జి.సిగడాం మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్నారంటూ కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి బుధవారం విచారణ జరిపారు. పొందూరు మోడల్ స్కూల్ ఫిజిక్స్ టీచర్, జి.సిగడాం మోడల్ స్కూల్ గణిత టీచర్ మెడికల్ లీవ్ పెట్టి రాజాంలో ఓ ప్రైవేటు పాఠశాలలో పెట్టుబడి పెట్టి పనిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆయా ఉపాధ్యాయులను డిప్యూటీ ఈవో ప్రశ్నించారు. మోడల్ స్కూల్లో పనిచేస్తూ ఇలా ప్రయివేటు పాఠశాలల్లో పనిచేయకూడదని హెచ్చరించారు. విచారణలో ప్రిన్సిపాల్‌లు ప్రభాకర్, శామ్యూల్స్ పాల్గొన్నారు.

గురుకులంలో కింగ్‌కోబ్రా హల్‌చల్



గదిలో ప్రవేశించిన కింగ్ కోబ్రా

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గురుకుల (బాలుర) పాఠశాల పదో తరగతి గదిలోకి సుమారు ఏడడుగుల కింగ్‌కోబ్రా ప్రవేశించింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. వెంటనే ఉపాధ్యాయులు గదికి తలుపులు వేసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు పాఠశాలకు చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నారు.

అమ్మపాలే అమృతం

- బిడ్డకు తల్లి పాలతో రోగ నిరోధక శక్తి మెరుగు
- 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు

పాతపట్నం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు
పాతపట్నం	105
మెళియపుట్టి	108
కొత్తూరు	108
హిరమండలం	78
ఎల్.ఎన్.పేట	61



తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

హిరమండలం: అమ్మ అనే పదంలోనే ఆప్యాయత, అనురాగం, మురిపం అనే సుగుణాలు మిళితమై ఉన్నాయి. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, తొలి టీకా తల్లిపాలు. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని నిపుణులు చెబుతున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువుకు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఐసీడీఎస్‌శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు వివరిస్తారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి..

కాన్పు అయిన మొదటి కొద్దిరోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ఇందులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. విటమిన్ ఏ, బీతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డ పేగులకు బలాన్ని ఇచ్చి జీర్ణశక్తి పెంచేందుకు తోడ్పడతాయి. కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుంచి కాపాడతాయి.

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. తల్లికి అన్ని రకాల ఆహారం పెట్టాలి. 6 నెలల తరువాత తల్లి పాలతో పాటు ఇంట్లో తినే ఆహారం మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు 2 ఏళ్ల వరకు తల్లిపాలు కొనసాగించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– యూ.విమల కుమారి,ఐసీడీఎస్ సీడీపీవో కొత్తూరు.

ప్రయోజనాలు అధికం

- తల్లిపాలలో ప్రోటీన్లు, కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియాలు ఉంటాయి.
- తల్లిపాలు తాగితే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
- తల్లిపాలు తేలికిగా జీర్ణమవుతాయి. ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి.
- తల్లిపాలు తాగే బిడ్డదవడలు బాగా బలపడతాయి.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంతకాలం మళ్లీ గర్భం రాకుండా గర్భ నిరోధకంగా కూడా పని చేస్తుంది.
- పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.
- బిడ్డకు రోజుకు కనీసం 8 నుమచి 10 సార్లు పాలు ఇవ్వాలి.

చేయకూడనివి

- పంచధార నీరు, తేనే, ఆవుపాలు, మేక పాలు, వస, గోమూత్రం బిడ్డకు పట్టకూడదు
- ఆరు నెలలు పూర్తయ్యేవరకు బిడ్డకు తినడానికి, తాగడానికి ఏమి ఇవ్వకూడదు.
- సీసా పాలు కూడా పట్టకూడదు.

తరగతులు ఎక్కడ నిర్వహించేది?



అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు భవనం



శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ రేగులపాడు ప్రాథమిక పాఠశాల తరగతి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ భవనం పాడవడంతో వర్షం పడితే నీరు లోపలకు చిమ్ముతుంది. బయట ఎక్కడిక్కడే పగల్లు ఏర్పడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఏళ్లు గడుస్తున్నా.. ఈ భవనం నేటికీ పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ అసంపూర్తి భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తుంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమణ

మెళియాపుట్టి: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. చెత్తచెదారాలు గ్రామానికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువల్లోని పూడికలను తొలగించాలని, తాగునీటి బావులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి



దుస్తులు అందజేస్తున్న వెంకటేష్

ఆమదాలవలస: సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. దుంపల జగదీష్–స్వప్న (ఎన్ఆర్ఐ) దంపతుల సహకారంతో 10 మంది అనాథ పిల్లలకు బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా మరెన్నో ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టులో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

1996 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



హరిప్రసన్నకు వినతిపత్రం అందజేస్తున్న 1996 డీఎస్సీ అభ్యర్థులు

పొందూరు: డీఎస్సీ–1996లో టీచర్ పోస్టులకు అర్హత సాధించిన వారికి న్యాయం చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు తాడివలస గ్రామంలో ఉన్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్నను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం 1996 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 1996 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

మహసింగి కాలనీలో విషాదం

కొత్తూరు: మండలంలోని మహసింగి కాలనీలో బుధవారం విషాదం నెలకొంది. ఈ కాలనీకి చెందిన విద్యార్థిని అక్షిత నందిగాం మండలంలోని గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థి అక్షిత ఇంటికి స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ వెళ్లి ఆత్మహత్యకు గల కారాణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని ఆషాఢ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేసి ఊరేగించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల సర్వే



సర్వే చేస్తున్న ఎండోమెంట్ అధికారులు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన భూమిని ఎండోమెంట్ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. పలు సర్వే నంబర్లలోని 19.72 ఎకరాలను ఎండోమెంట్ సర్వేయర్ దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రమణయ్య సర్వే చేపట్టారు. ఎండోమెంట్ భూములకు ఆనుకుని ఉన్న కొంత మంది రైతులు 1.10 ఎకరాలను ఆక్రమించినట్లు ఎండోమెంట్ ఈఓ ప్రభాకర్‌రావు తెలిపారు. సర్వే చేసిన భూమిని ఆలయ అర్చకులకు అప్పగించామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయ రేపు

సరుబుజ్జిలి: ఈ నెల 2వ తేదీ వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రొట్టవలస ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు, మరమ్మతులు చేస్తామన్నారు. మర్రిపాడు నుంచి చిగురువలస, సింధువాడ నుంచి మూలవలాపురం గ్రామాల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని కొల్లివలస సబ్‌స్టేషన్ పరిధిలో గుత్తావల్లి ఫీడర్ బ్రేకర్ రిపేర్‌ను శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు తెలియజేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

పొందూరు మండలంలో..

పొందూరు: ఈ నెల 2వ తేదీన స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఈఈ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాపాక జంక్షన్, కృష్ణాపురం, పొందూరు, కొంచాడ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: ఈ నెల 2న స్థానిక 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఈఈ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణం పరిధిలోని కేవీకే, బీఆర్‌నగర్, రైల్వే స్టేషన్, మెయిన్ రోడ్డు, ఎమ్మార్వో ఆఫీస్, ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపం, వరదా వారి క్వార్టర్స్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గాజులకొల్లివలస 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మునగవలస, గాజులకొల్లివలస ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చెట్ల కొమ్మలు తొలగించటం, మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. గాజులకొల్లివలస, చిన్నజొన్నవలస, పెద్దజొన్నవలస, మునగవలస, రాధాకృష్ణాపురం, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరిపేట, చవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మురుగునీటితో అవస్థలు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు వీధి రోడ్లుపైనే ప్రవహిస్తోంది. గ్రామంలోని ప్రధాన వీధిలో సిమెంట్ రోడ్డు ఉన్నప్పటికీ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టలేదు. వర్షం నీరు, ఇళ్లల్లో వాడిక నీరు వీధిరోడ్డుపైనే ప్రవహిస్తుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాతపట్నం: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన మద్ది పుష్పలత(మూగ)పై కింద ఇంటిలో ఉంటున్న గోపాల్ కుటుంబ సభ్యులు దాడి చేశారని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని సీఐ నల్లి సాయి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25వ తేదీన పుష్పలత ఇంటిపై నుంచి చెత్త విసిరింది. కింద ఇంటిలో ఉంటున్న గోపాల్ ఇంటిలో పడిందని, ఒంటరిగా ఉంటున్న పుష్పలతపై గోపాల్, ఈశ్వరమ్మ, రోజా దాడి చేశారు. ఈ విషయాన్ని పుష్పలత తన అక్క అసపాన రోజాకు చేరవేసింది. పోలీసులకు చెప్పడంతో రాజీచేసి పంపించేశారు. ఈ నెల 30 తేదీ రాత్రి ఒంటరిగా ఉన్న పుష్పలతపై మళ్లీ దాడి చేశారు. ఈ విషయంపై అక్క అసపాన రోజా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు



కోవిలాం వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో వరి నాట్లు వేసుకునేందుకు వీలుగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదనీటిలో మునిగి కుళ్లిపోయిన వరి వెద పొలాల్లోనూ నాట్లు వేస్తున్నారు. మండలంలోని కోవిలాం, రావిచంద్రి, ధనుకువాడ, దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, చిట్టిమండలం, సోమనాథపురం తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో వరినాట్లు వేసే పనులు చేపడుతున్నారు. మండలంలో సుమారు 12 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా 10 వేల ఎకరాల్లో వరి వెదలు వేసినట్లు ఏఓ పైడి లతశ్రీ చెప్పారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని తొగరాంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం పంపిణీ చేశారు. తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా బాధ్యతల అప్పగింత



ప్రభాకరరావు

నరసన్నపేట: మండలంలోని కొత్తపోలవలస పంచాయతీ సర్పంచ్‌గా ఉప సర్పంచ్ పట్ట ప్రభాకరరావుకు ఎంపీడీఓ రామకృష్ణ బాధ్యతలను అప్పగించారు. సర్పంచ్‌గా ఎన్నికైన శ్యామ్‌బాబు గత కొంత కాలంగా కనిపించకపోవడంతో.. పాలనా సౌలభ్యం కోసం ఉప సర్పంచ్‌గా ఉన్న ప్రభాకరరావుకు బాధ్యతలు ఇచ్చారు. ప్రభాకరరావు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ బుధవారం తెలిపారు. నిధులు, ఖర్చులు తదితర అంశాలపై అనుమతి ఇస్తూ కౌంటర్ సంతకం ఈఓపీఆర్డీకి డీడీఓ ఇచ్చినట్లు ఎంపీడీఓ చెప్పారు.

రోడ్లే పార్కింగ్ స్థలాలు..



ఎస్‌బీఐ బ్రాంచ్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

పాతపట్నం:

పాతపట్నంలో కల్యాణ మండపాలు, బ్యాంకులు, బహుళ అంతస్తుల భవనాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. భవంతులు పెరుగుతున్నా పార్కింగ్ కోసం ఆయా యాజమాన్యాలు స్థలాలు కేటాయించపోవడంతో నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది. కల్యాణ మండపాలు, బ్యాంకుల వద్ద పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే (జాతీయ రహదారి) పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి సాధారణ ప్రజలతోపాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అనుమతులు మంజూరు చేసే సమయంలోనే చాలా వరకు లొసుగులు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

అలంకారప్రాయం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో సెంటర్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. ఒక రోజు వెలిగితే పది రోజులు వెలగడం లేదు. దీంతో పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సెంటర్ లైటింగ్ గతంలో బాగుండేదని, గత నెల రోజులుగా సక్రమంగా వెలగడం లేదని స్థానికులు అంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెలగని లైట్లు